43. ఈ 42 ట్రిక్స్ మీకు పని చేయకపోతే ఇక 'నన్ను పెళ్ళి చేసుకోవా?' అని డైరెక్ట్‌గాఅడిగేయండి. 43 వది ఇదొక్కటే మిగులుతుంది మీకు.

మీ 'శుభలేఖ' నాకు పంపడం మర్చిపోకండి. మీ లాంటి వాళ్ళని మీ పెళ్ళికి చాలామందిని పంపాలిగా మరి.

# సుందర వదనానికి చిట్కాలు

కొత్త సంవత్సరం వచ్చిందంటే చాలు. కొత్త వుత్సాహం, కొత్త నిర్ణయాలు, పాత సంవత్సరం మనకేం ఇచ్చింది, ఏం ఇవ్వలేదు అన్న ఆలోచనలు. చేద్దామనుకుని చెయ్యకుండా మిగిలిపోయినవి కొత్త సంవత్సరంలో చేయాలన్న తపన. బంధుమిత్రులకి గ్రీటింగ్స్‌ని శుభాకాంక్షలు తెలుపుతూ పంపటం కూడా కొత్త సంవత్సరం ముచ్చట్లలో ఒకటి.

ఈ సంవత్సరం నేను కొన్ని నూతన సంవత్సర నిర్ణయాలు తీసుకున్నాను. డైరీలో రాసుకునే బదులు పబ్లిక్ చేస్తే ప్రపంచానికి కూడా అవి తెలియజేసినట్లవుంది అని రాస్తున్నాను. ఇప్పుడు వీటిని ఆచరించడానికి చచ్చినట్లు ఇంకా స్త శ్రద్ధ వహించాలి నేను. ఎందుకంటే అందరికీ తెలిసిపోతుందిగా.

నేను ఎప్పటికన్నా అందంగా, సుందరంగా కనబడాలి అన్నది ఆ నిర్ణయం. అయితే హెడ్ అండ్ షోల్డర్స్ షేంపూ, గిల్లెట్ లెమన్ షేవింగ్ క్రీమ్, గార్డెన్ రోజ్ పెర్‌ఫ్యూమ్, రేమాండ్ సూటింగ్స్, అంబాసిడర్ బూట్లు, సెవెన్ సిస్ అఫ్టర్ షేవ్ లోషన్ లాంటివి చాలా కాలంగా వాడుతున్నవే. ఈసారి అందానికి కొత్త అలంకరణ సామగ్రిని ఎన్నుకున్నాను. నిజానికి ఇది ఏ వయసువారికయినా, ప్రపంచంలోని ఏ ప్రాంతానివారికయినా అందరికీ సమానంగా

వుపయోగించే అలంకరణ సామగ్రి. అందుకు ప్రతి మనిషిలో సహజంగా వుండే కొన్ని గుణాలని వదులుకుంటే చాలు అని నా నమ్మకం. ఈ సంవత్సరం నా మొహంలో ముడతలు పడకుండా జాగ్రత్త పడటానికి నేను ముఖ్యంగా వదలాల్సిన గుణం కోపం. కోపం? అవును. కోపం.

కోపంగా వున్న ఏ మనిషి మొహం అందంగా కనపడదు. కోపంతో కనుబొమ్మలు ముడవడం, మొహం ముడుచుకోవడంతో ఆలస్యంగా రావాల్సిన ముడతలు ముందే వచ్చేస్తాయి. అందుకని నా కోపాన్ని తగ్గించుకుని చీటికి మాటికి ప్రతి చిన్న విషయానికి ఇంట్లో వాళ్ళ మీద, బయటవాళ్ళ మీద అరవడం తగ్గించి అందంగా కనబడా లన్నది నా నిర్ణయం.

అందం కోసం నేను విడనాడాల్సిన రెండో గుణం గర్వం. 'నాకేం. నేను బాగానే వున్నాగా' అన్న గర్వం వదులుతే ఎన్నో సలహాలని స్వీకరించవచ్చు. ఉదాహరణకు నా హెయిర్ స్టైయిల్ మార్చమని ఎవరయినా సలహా ఇచ్చినా, మీసం పెంచమనో తగ్గించమనో లేదా జుట్టుకి రంగు వేసుకోమనో, హాఫ్ హేండ్స్ బదులు పొడుగు చేతుల చొక్కా వేసుకోమనో, బూట్లకి వారానికోసారి పాలిష్ చేయించుకోమనో, కళ్ళు తెరచుకుని ప్రవర్తించమనో.... ఇలా ఎన్నో సలహాలు విన్నప్పుడు గర్విష్టితనంతో 'నువ్వేం చెప్పక్కర్లేదు. నాకు తెలుసు' అన్న ధోరణిలో 'జుట్టుకి రంగేసుకుంటే మేధావిగా కనబడును' లాంటి సమాధానాలని నాకు నేనే ఇచ్చుకుని, మారకుండా వుండగలగడం చేయను. వాళ్ళు చెప్పేదాని గురించి కనీసం ఆలోచిస్తాను. ఆచరించి అందులో నిజం వుందో లేదో చూస్తాను. ఒక్క మేకప్‌కి సంబంధించిన విషయాల్లోనే కాక నా ప్రవర్తనలో కూడా మార్పు తెస్తాను. మనిషి ప్రవర్తనే మనిషి అందం కదా మరి.

నేను వదిలేసే మూడో గుణం అసూయ. అవును. అసూయవల్ల మనుషులు అంద విహీనంగా కనిపిస్తారు. ఓ రచయితకి కేంద్ర ప్రభుత్వ అవార్డు వస్తే 'నాకు రాలేదన్న అసూయతో 'ఆయన డాస్టా విస్కీ రచనలని కాపీ కొట్టాడు కనక కాని అది ఆయన సమర్థత వల్ల వచ్చింది

కాదు' అని డంబాలు పల్కడం వల్ల మనం ఎదుటి వాళ్ళకి అసహ్యంగా కన్పిస్తాం. ఇంకో రచయిత ఎదుగుతూంటే అసూయతో 'ఆ. వాడి కథలు నేను దిద్ది పెట్టేవాణ్ణి' అనో లేదా, యువతరం రచయితలు సెక్స్, వయోలెన్స్ రాసి దేశాన్ని నాశనం చేస్తున్నారు' అనో అని అతని గొప్పతనం తగ్గించాలని, నేను గొప్ప సిన్సియర్ రైటర్ అని పదిమంది ముందు స్మరింపబడాలనో చేయను. ఇందువల్ల మనసు ప్రశాంతంగా వుండి మొహం, కళ్ళు తేటగా ప్రకాశవంతంగా కనిపిస్తాయి.

నే వదలాల్సిన ఇంకో ముఖ్య దుర్గుణం స్వార్థం. ప్రముఖ వార పత్రికల్లో నా సీరియల్సే వుండాలి, మిగతా రచయితలు చిన్న చిన్న అరు పేజీల మాసపత్రికలకే రాయాలి అనుకోవడం. నా పుస్తకాలు అమ్ముడై నేను 'నంబర్ వన్' రచయితగా కీర్తి గడించాలనుకోవడం. ఎంతసేపటికి ఈ స్వార్థపు ఆలోచనలతో మేలుకుని వున్నంత కాలం సతమతమయిపోయి అసలు రాసే దాని మీద కాన్సన్ట్రేషన్ వుండదు. ఫలితంగా పాఠకులకి దూరం అయి, వాళ్ళకి మళ్ళీ ఎలా దగ్గర అవాలా అన్న బాధ మనసుని ఆవరించి అది వద్దమకున్నా మొహం మీద కనిపిస్తుంది. గడ్డం గీసుకోవాలనిపించదు. స్వార్థం వల్ల ముఖ వర్చస్సు ఇంతలా పాడవుతుంది.

మరో దుర్గుణం బద్ధకం. ఎంత అందంగా వున్నా బద్ధకస్థులని ఎవరూ ఆదరంగా చూడరు. మిత్రుడి తమ్ముడి పెళ్ళికి వెళ్ళాలంటే బద్ధకం. 'హోమ్ ఎలోన్' సినిమా చూడటానికి వెళ్ళాలంటే బద్ధకం. ఈ వారం 'కృష్ణశబ్దం' రాయకపోతే ఏమైందిలెస్తూ అనుకోవడం బద్ధకం. అలాంటప్పుడు 'బాబ్బాబూ. నువు రాసి పెడుదూ' అని ఘోస్ట్ రైటర్ని ప్రతిమాలుకోవాలన్న ఆలోచన కలగకమానదు. దాంతో రచయితగా మన పేరు మనమే కేష్ చేసుకునే ధోరణికి అలవాటయ్యాక పైపేరాలో 'స్వార్థం' వల్ల చివర్లో కలిగే ఎఫెక్ట్స్ అన్నీ మళ్ళీ కలిగి మళ్ళీ గడ్డం పెంచేస్తేం. పాఠకులకి మనం పరిచయం అయినప్పుడు రచయితగా ఆరాధనగా వాళ్ళు చూసే చూపులు మిస్ అవుతాం. మన మొహం అంద విహీనంగా కనబడటంతో చీదరింపుగా చూస్తారు, 'ఎంత చక్కటి రైటర్

ఎంత ఛండాలంగా రాస్తున్నాడో!' అని.

ఇంకోటి భోజన ప్రియత్వం. మనిషి అధికంగా ప్రేమించేది భోజనాన్నే. దీనికిందే ఇతరములు జాబితాలో వస్తాయి. రేపనేది లేకున్నట్లుగా తింటే త్వరలోనే రేపనేది లేకుండా పోయే రోజు వస్తుంది. అధిక భోజనం మొహంలోనే కాక మిగతా అన్ని భాగాల్లో కనబడి తీరుతుంది. కోపం, కామం కూడా అధికం అయి దుష్ఫలితాలకి దారి తీస్తాయి.

ఆఖరిగా నేను వదిలేయాలనుకున్నది ద్వేషం. అమెరికాలో రూపాయి ఎలా చెల్లుబాటు కాదో అలాగే మనదేశంలో నిజాయితీ చెల్లదని పూజాబేడీ చెప్పింది. ఇది అక్షర సత్యం. ఎదుటి వాళ్ళు మనలా నిజాయితీగా వుండాలని ఎక్స్‌పెక్ట్ చేసి, వాళ్ళు మనని ఏదో విషయంలో మోసం చేస్తే ద్వేషం పెంచుకోవడం వల్ల మన మనసే పాడవుతుంది. దాంతో 'ఎలా వాణ్ణి దెబ్బ తీయాలి' అనే ఆలోచనలు. వాటి వేడి. దాంతో బి.పి. పెరగడం.... 'మనిషి మొహం అతని ఆలోచనలకి అద్దం' అంటారు కదా. మన ద్వేష భావం వద్దనుకున్నా అంద వికారంగా మన మొహంలో ప్రతిబింబిస్తూంటుది. చిరునవ్వు పులుముకున్నా ట్రాన్స్‌పరెంట్ కర్టెన్‌లా అది మన మనస్సులోని ద్వేషాన్ని, పగని దాయలేదు.

ఈ రకంగా వీటన్నిటిని పరిత్యజించి బ్రతికితే నా మొహం ఎంతో అందంగా కనిపిస్తుందన్న నమ్మకం నాకుంది కాబట్టి 1992న నూతన సంవత్సర నిర్ణయంగా నేను కోపాన్ని.... (అబ్బబ్బ....ఎన్ని సార్లు చెప్పాలి నే రాసుకునేప్పుడు టి.వి. పెట్టదని.... శనిలా దాపురించావ్....) ఆ.... ఎక్కడున్నాను....యస్.... సారీ ఫర్ ది ఇంట్రప్షన్. కోపాన్ని, గర్వాన్ని, అసూయని, స్వార్థాన్ని, బద్ధకాన్ని, భోజన ప్రియత్వాన్ని, ద్వేషాన్ని – ఈ ఏడు దుర్గుణాలని వదిలేయాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను. మా సందులోని అందరికన్నా, ఆ మాటకొస్తే మిగతా రచయితల కన్నా నేను మరింత అందంగా కనిపించగలిగే స్థయిర్యం నాకివ్వాలని ఆ పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను.